క్లుప్తంగా

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని సత్వార్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు గురువారం ఎమ్మెల్యే మాణిక్‌రావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దళితులకు అన్యాయం చేయొద్దు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): దళితబంధు పథకం ఎంపికలో దళితులకు అన్యాయం చేయొద్దని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. అర్హులైన దళితులకు దళితబంధు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రామచంద్రాపురం పట్టణంలో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన వారికి మాత్రమే దళితబంధు పథకానికి ఎంపిక చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని నిరుపేద దళితులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రీకాంత్ రెడ్డి శ్యామ్‌రావు, మహేష్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, నర్సింగరావు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, వైస్‌చైర్మన్ రాములుగౌడ్ అన్నారు. గురువారం ఈదుల నాగులపల్లిలోని రేడియల్ రోడ్డును ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేడియల్ రోడ్డు పనులతో గ్రామంలోని డ్రైనేజ్ సమస్య జటిలంగా మారడంతో డ్రైనేజీ నీరు తిరిగి ఇళ్లల్లోకి చేరుతోందని అధికారులకు వివరించారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ అండ్‌బీ ఈఈ బీబీ రావు, కౌన్సిలర్లు శంషాబాద్ రాజు, రవీందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబులెన్స్ ప్రారంభం



అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న సీఐ నాగరాజు

వట్‌పల్లి(అందోల్): జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో నూతన 108 అంబులెన్స్‌ను సీఐ నాగరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాయపడ్డవారిని సకాలంలో ఆస్పత్రికి చేర్చే 108 అంబులెన్స్ సేవలు ప్రశంసనీయమన్నారు. అదేవిధంగా అంబులెన్స్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల పనితీరును అభినందించారు. ఎస్‌ఐలు, అంబులెన్స్ పైలట్ క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, కమిషనర్

పటాన్‌చెరు: మొక్కల సంరక్షణ అందరి బాధ్యత అని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు సాయిభగవాన్ కాలనీ, 13వ వార్డు బసవేశ్వర కాలనీలలో గురువారం మొక్కలు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్లు కృష్ణ, బోయిని బాలరాజు, లావణ్య శశిధర్‌రెడ్డి, అనిరుద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్డర్ల కోసం పడిగాపులు

హత్నూర(సంగారెడ్డి): హత్నూర మండలం వీఆర్‌ఏలు ఆర్డర్ కాపీల కోసం తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం అర్ధరాత్రి వరకు పడిగాపులు కాశారు. మండలంలోని 82 మంది వీఆర్‌ఏలు వివిధ శాఖల్లోకి సర్దుబాటు చేయడంతో ఆర్డర్ కాపీ కోసం నిరీక్షించారు. దీంతో కార్యాలయం ఎదుట సందడి నెలకొంది. జిల్లా కేంద్రం నుంచి పోస్టింగ్ ఆర్డర్ కాపీలు రావడంలో ఆలస్యం జరగడంతోనే ఈ సమస్య నెలకొందని తహసీల్దార్ సంధ్య తెలిపారు.

మున్సిపాలిటీకి దశలవారీగా నిధులు

- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి
- అభివృద్ధి పనుల పరిశీలన



కాలనీవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: నారాయణఖేడ్ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధికి దశలవారీగా నిధులు మంజూరు చేస్తూ అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తున్నామన్నారు. పట్టణ శివారులోని కాశీనాథ్ ఆలయ భూముల్లో ఏర్పాటు చేసిన అద్దెకు దుకాణాల సముదాయాలను పరిశీలించి రోడ్ల నిర్మాణ వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, కౌన్సిలర్లు స్వప్న అభిషేక్‌షెట్కార్, సంధ్యారాణి రామకృష్ణ, కోఆప్షన్ అంబదాస్, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ విజయ్‌బుజ్జి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఖేడ్ మండల పరిషత్తు కార్యాలయం వద్ద గౌడ సంఘం భవన నిర్మాణానికి కేటాయించిన 4గుంటల భూమి పత్రాలను సంఘం బాధ్యులకు అందజేశారు. ఖేడ్, నాగల్‌గిద్ద, జూకల్ గ్రామాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

రోగుల సేవల్లో నిర్లక్ష్యం వద్దు

రోగులకు అందించే సేవల్లో నిర్లక్ష్యం వహించవద్దని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వైద్య సిబ్బందికి సూచించారు. వైద్యరంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఖేడ్ ప్రాంతీయ ఆస్పత్రి, మాతా, శిశు సంరక్షణ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనా నజీబ్, కోఆప్షన్ నవాబ్, నగేష్ ఉన్నారు. అనంతరం నాగల్‌గిద్ద మండలం కరస్‌గుత్తికి చెందిన లక్ష్మీబాయికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు.

‘గీతం’లో ఐఈఐ విభాగం ప్రారంభం



మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

పటాన్‌చెరు టౌన్: రుద్రారంలోని గీతం విశ్వవిద్యాలయం ద ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) విద్యార్థి విభాగాన్ని గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఐఈఐ తెలంగాణ విభాగం అధ్యక్షుడు బ్రహ్మారెడ్డి, ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ (ఈఎస్‌సీఐ) డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు, ఐఈఐ పరిశోధన–అభివృద్ధి విభాగం జాతీయ అధ్యక్షుడు సత్యనారాయణ రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐఈఐని 1920లో స్థాపించారని, మనదేశంలో 15 ఇంజనీరింగ్ విభాగాల్లో 8లక్షల మంది సభ్యులతో 25 కేంద్రాలు ఉన్నాయని వివరించారు. అదేవిధంగా ఈఎస్‌సీఐ సాధించిన ప్రతిష్టాత్మక అవార్డులకు సంబంధించిన వీడియోను ప్రదర్శించారు. అనంతరం డాక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ పరిశోధనలను చేపట్టే విద్యార్థులను ఐఈఐ ప్రోత్సహిస్తోందన్నారు. ఐఈఐతో తనకున్న 25 ఏళ్ల అనుబంధాన్ని, విద్యార్థిగా ఉన్నప్పుడు ఉత్తమపత్ర సమర్పణకు గాను పొందిన బంగారు పతకం వివరాలను గీతం కోర్ ఇంజనీరింగ్ డీన్ ప్రొఫెసర్ వీఆర్ శాస్త్రితో గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ అధిపతి డాక్టర్ శ్రీనివాస్, ప్రొఫెసర్ ఈశ్వర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయులపై నిర్లక్ష్యం తగదు

- తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్
- కలెక్టరేట్ ఎదుట నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

కొండాపూర్(సంగారెడ్డి): ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ అన్నారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సంగారెడ్డిలోని కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఈ తొమ్మిదేళ్ల కాలంలో విద్యారంగం నిర్లక్ష్యానికి గురైందని, నెల జీతం కోసం ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. పీఆర్‌సీ గడువు జూన్ 30న ముగిసిందని, జూలై 1 నుంచి అమలయ్యేవిధంగా మధ్యంతర భృతిని ప్రకటించాలన్నారు. అదేవిధంగా నూతన పీఆర్‌సీ కమిటీని వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దత్తాత్రి, అడివప్ప రాష్ట్ర సహకోశాధికారి భాస్కర్ దేశ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బస్వరాజ్ సాంస్కృతిక కార్యదర్శి నర్సింహారెడ్డి జిల్లా బాధ్యులు రమేష్, పద్మ, మల్లికార్జున్, వినయ్‌కుమార్, లక్ష్మి, నర్సింహులు, తుక్కప్ప పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్ఫూర్తితో ఉద్యమాలు



కొండాపూర్: నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు



జహీరాబాద్ టౌన్: మాట్లాడుతున్న సాయిలు

కొండాపూర్(సంగారెడ్డి): క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకుందామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బీరం మల్లేశం పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా స్వదేశీ విదేశీ కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తోందని ధ్వజమెత్తారు. 40 కోట్ల మంది అసంఘటిత రంగ కార్మికుల జీవితాలు లేబర్ కోడ్‌లతో ప్రశ్నార్థకంగా మారనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు బాగారెడ్డి, యాదగిరి, సురేష్, ప్రవీణ్, మహేష్, సువర్ణ, యాదగిరి, లక్కన్, మహబూబ్‌ఖాన్, ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

పటాన్‌చెరు టౌన్: కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దామని, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. గురువారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మండల పరిషత్ దుకాణాల సముదాయం ఎదుట మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక త్యాగాలతో పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను, 4 లేబర్ కోడులుగా మారుస్తూ పార్లమెంట్‌లో చట్టం చేసిందని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పాండురంగారెడ్డి, నాగేశ్వరరావు, కోశాధికారి నర్సింహారెడ్డి, వాజిద్‌అలి, రాజు, శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

జహీరాబాద్ టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ కొంతమంది పెట్టుబడుదారుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొట్లాదిమంది కార్మికుల జీవితాలను రోడ్డుపాలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మహిపాల్, రాజిరెడ్డి, యశోదమ్మ, రాములు, కిష్టయ్య, చంటి, శ్రీనివాస్, నందమ్మ, గౌరమ్మ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన నీలం మధు, నారాయణ



నారాయణను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ, నీలం మధు, రాజు

వట్‌పల్లి(అందోల్): రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు ఎమ్మెల్సీ బండా ప్రకాష్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు పాల్వంచ నారాయణ, రాష్ట్ర ముదిరాజ్ సంఘం నేత నీలం మధు కలిశారు. ఈ సందర్భంగా అమెరికా వెళ్లి ఇండియాకు తిరిగి వచ్చిన నారాయణను శాలువాతో సన్మానించారు. వారి వెంట జిల్లా ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు పులిమామిడి రాజు తదితరులు ఉన్నారు.

అనాథ బాలుడి గుర్తింపు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలోని వైఎస్‌ఆర్ కాలనీలో అనాథ బాలుడిని గుర్తించినట్టు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అనాథ పిల్లలను గుర్తించేందుకు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. బంధువుల సంరక్షణలో ఉన్న బాలుడి వివరాలు నమోదు చేసుకున్నామని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సబిత తదితరులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న ఏఐసీఎఫ్ సభ్యులు

పటాన్‌చెరు టౌన్: దళిత క్రైస్తవులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఏఐసీఎఫ్ (ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి టీడీఎస్ మనీ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ పిలుపుమేరకు బ్లాక్ డేలో భాగంగా గురువారం పటాన్‌చెరు తహసీల్దార్ భాస్కర్‌కు ఏఐసీఎఫ్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ దళిత క్రైస్తవుల స్వేచ్ఛను హరింపచేసిన రాష్ట్రపతి ఉత్తర్వు(షెడ్యూల్ కులాలు) 1950 మూడో పేరాను వెంటనే రద్దు చేయాలన్నారు. జస్టిస్ రంగనాథ్ మిస్టర్ కమిషన్ దేశమంతా పర్యటించి దళితులు క్రైస్తవులు జీవితాలను అధ్యయనం చేసిందన్నారు. అదేవిధంగా మణిపూర్‌లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులకు కేంద్రప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐసీఎఫ్ సభ్యులు ప్రదీప్ విజయ సారథి ప్రభాకర్ జేమ్స్ మనోహర్ జాన్‌రాజు బెనర్జీ కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

మూడు చోట్ల చోరీలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలోని గుమ్మడిదలలో మల్లికార్జునస్వామి, ఎల్లమ్మతల్లి దేవాలయాల్లో గురువారం గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ నిర్వాహకులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయాల్లో రెండు తులాల బంగారం, హుండీ, సీసీటీవీ ఫుటేజ్ హార్డ్ డిస్క్, చోరీకి గురైనట్లు తెలిపారు. ఎస్‌ఐ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు చోరీకి గురైన ఆలయాలను పరిశీలించారు. పోలీసులు వెంటనే స్పందించి విచారణ చేపట్టి దుండగులను కఠినంగా శిక్షించాలని స్థానిక ప్రజలు కోరారు.

పాన్‌షాపులో..

జహీరాబాద్ టౌన్: జహీరాబాద్ పట్టణంలోని రాంనగర్ ప్రాంతంలోని షమా పాన్‌షాపులో చోరీ జరిగింది. బాధితుడు జావీద్‌అలీ తెలిపిన వివరాల ప్రకారం.. జహీరాబాద్–తాండూర్ రహదారిపై రాంనగర్ ప్రాంతంలో జావీద్ అలీ షమా పేరిట పాన్‌షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పాన్‌షాపులోకి చొరబడి రూ.50వేలు విలువ చేసే వస్తువులతో పాటు రూ.10వేల నగదు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ద్విచక్రవాహనం..

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌లో ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు గురువారం చోరీ చేశారు. రేగోడ్ మండల పరిధిలోని ఆర్.ఇటిక్యాల్ గ్రామానికి చెందిన ఇలిటెం వీరప్ప నారాయణఖేడ్ పట్టణంలో వ్యాపారం చేస్తూ ఇక్కడే అద్దె ఇంట్లో ఉంటున్నాడు. బుధవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో ఇంటి ముందు నిలిపి ఉన్న ప్యాషన్‌ప్రో ద్విచక్రవాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. దీంతో చుట్టుపక్కల వెతికినా జాడ లేకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

జిన్నారం(పటాన్‌చెరు): చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గుమ్మడిదల మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన భానుచందర్(21) ఈ నెల 5 తేదీన బైక్‌పై గుమ్మడిదల వైపు వేగంగా వెళ్తుండగా అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ భానుచందర్ గురువారం మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

దేశానికే ఆదర్శం.. తెలంగాణ రాష్ట్రం



గొర్రెలను పంపిణీ చేస్తున్న చింతా ప్రభాకర్

- అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట
- రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శం తెలంగాణ రాష్ట్రమని రాష్ట్ర చేనేత సహకార అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని నందికంది గ్రామంలో గురువారం పలువురు లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గొల్లకురుమలు ఆర్థికంగా అభివృద్ధి చెందుటకు సీఎం కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. రైతుబంధు సమితి అధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుమార్‌గౌడ్, ప్రజాప్రతినిధులు రాజు, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

చింతా ప్రభాకర్‌ను కలిసిన జెడ్పీటీసీ రమేశ్

వట్‌పల్లి(అందోల్): వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అందోల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా తనకు టికెట్ ఇవ్వాలని కోరుతూ జెడ్పీటీసీల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఖాదీరాబాద్ రమేష్ గురువారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

లెర్నింగ్ లైసెన్స్ తప్పనిసరి

సంగారెడ్డి మున్సిపాలిటీ: సంగారెడ్డి, కొండాపూర్ మండలాలకు చెందిన యువతకు గురువారం పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో 350 మందికి లర్నింగ్ లైసెన్స్‌లను పంపిణీ చేశారు. సీడీసీ చైర్మన్ కసాల బుచ్చిరెడ్డి, సీడీసీ మాజీ చైర్మన్ విజేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి నర్సింలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

కంది(సంగారెడ్డి): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని చేర్యాలలో గురువారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో ఎంపీపీ సరళ, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి, సర్పంచ్ శ్రవణ్ కుమార్, ఉపసర్పంచ్ చంద్రారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఖాజఖాన్, సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆర్థికసాయం

పటాన్‌చెరు టౌన్: ప్రజాసేవే లక్ష్యంగా ఎన్‌ఎంఆర్ యువసేన కృషి చేస్తోందని యువసేన సభ్యుడు సాయిబాబు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని కుమ్మరి బస్తీకి చెందిన నర్సింహులు ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో విషయం తెలుసుకున్న సాయిబాబు ఎన్‌ఎంఆర్ యువసేన తరఫున రూ.10 వేల ఆర్థికసాయాన్ని మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంఆర్ సభ్యులు సడబోయిన పాండు, సాయిరాజ్, భరత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

◆ విరాళం అందజేత

వట్‌పల్లి(అందోల్): జోగిపేట పట్టణంలోని మల్లికార్జునస్వామి ఆలయ పునర్‌నిర్మాణం కోసం గురువారం అందోల్–జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులకు 12వ వార్డు కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు ముదిరాజ్ రూ.5,111వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కుమారస్వామి, వెంకటేశం, మల్లేశం, లక్ష్మణ్, శ్రీశైలం పాల్గొన్నారు.

◆ డీసీపీని సస్పెండ్ చేయాలి

నారాయణఖేడ్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని హైదరాబాద్‌లో బుధవారం సచివాలయం ముట్టడికి తరలివెళ్తున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర నాయకులపై దాడిచేసిన డీసీపీ వెంకటేశ్వర్‌రావును వెంటనే సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ సంఘాల జిల్లా బాధ్యులు అశోక్, తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. దాడిని నిరసిస్తూ ఖేడ్‌లో గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పోలీసు అధికారులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని తమపై దాడి చేయడం సరైందికాదన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ప్రవీణ్, ఇసాక్ తదితరులు పాల్గొన్నారు.

◆ స్థలం కేటాయించాలని వినతి

కొండాపూర్(సంగారెడ్డి): నీలి కుల సంఘానికి భవనం నిర్మించేందుకు స్థలాన్ని కేటాయించాలని ఆ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు గురువారం సంగారెడ్డిలోని క్యాంపు కార్యాలయంలో హెచ్‌డీసీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ ప్రదీప్, నాగరాజుగౌడ్, నీలి కుల సంఘం అధ్యక్షులు అంజయ్య, ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్, ఉపాధ్యక్షులు ప్రవీణ్ కుమార్, చంద్రయ్య, సంయుక్త కార్యదర్శి విక్రం, నారాయణమూర్తి, సుదర్శన్, లక్ష్మణ్, యాదగిరి పాల్గొన్నారు.

◆ బొట్టువేసే పద్ధతిలో ఎరువులు వేసుకోవాలి

వట్‌పల్లి(అందోల్): రైతులు పత్తి పంటకు బొట్టు పెట్టే పద్ధతిలో ఎరువులు వేసుకోవాలని సంగుపేట ఎరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సరిత సూచించారు. గురువారం ఆర్‌ఏడబ్ల్యూఈపీ విద్యార్థులతో కలిసి అందోల్ మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలపై సమగ్ర సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు శంకర్‌గౌడ్, దుర్గప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

◆ దోమల నివారణకు చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీలో దోమల నివారణకు చర్యలు చేపట్టామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినోద్ అన్నారు. బుధవారం రాత్రి మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ 1వ వీధిలో దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ రోడ్లకు మరమ్మతులు

జిన్నారం(పటాన్‌చెరు): ఇటీవల కురిసిన వర్షాలకు బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతినగర్ కాలనీలో ధ్వంసమైన రోడ్లకు బీఆర్‌ఎస్ నాయకుడు, కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శేఖర్, దత్తు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

◆ ఈవీఎంపై అవగాహన

మునిపల్లి(అందోల్): ఓటు వేసే విధానంపై కల్లపల్లి బేల్లూర్ గ్రామంలో గురువారం ఉప తహసీల్దార్ కృపదానం ఓటర్లకు ఈవీఎంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లింగం, ఓటర్లు పాల్గొన్నారు.

◆ ఘనంగా ఫ్రెషర్స్ డే

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెల ప్రభుత్వ పాఠశాల, కళాశాల ప్రాంగణంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు గురువారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

◆ అభివృద్ధి పనులపై సమీక్ష

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ వార్డు కార్యాలయంలో గురువారం కార్పొరేటర్ పుష్పనగేష్ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగ, జలమండలి అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంజూరైన సీసీ రోడ్డు పనులను త్వరగా ప్రారంభించాలని అధికారులకు సూచించారు.

◆ ఇళ్ల మంజూరుకు సిద్ధం

మునిపల్లి(అందోల్): రాజకీయ పార్టీలకతీతంగా అర్హులైన లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకం ద్వారా ఇళ్ల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని జెడ్పీటీసీ మీనాక్షి సాయికుమార్ తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో గృహలక్ష్మి పథకం మంజూరుకు దరఖాస్తు ఫారాలను ఎంపీడీఓ హరినందన్‌కు అందజేశారు.

◆ అనాథ శవానికి అంత్యక్రియలు

హత్నూర (సంగారెడ్డి): అనాథ శవానికి యువకులు అంతక్రియలు నిర్వహించారు. హత్నూర మండలంలోని కాసాల గ్రామ శివారులోని దౌల్తాబాద్ బస్టాండ్‌లో వెనుక భాగంలో ఓ అనాథ వృద్ధుడు మృతి చెందడంతో సమాచారం అందుకున్న స్థానిక యువకులు గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో అంతక్రియలు చేశారు. అంత్యక్రియలు చేసిన వారిలో యువకులు రమేష్, ఖలీల్, గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.